RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  సంపుటి : 1 సంచిక:63  25-8-2025  సోమవారం  ఎడిటర్ :మర్రి పవీణ్  పేజీలు : 8  వెల 4 /-

## మన దైనందిన జీవితాలను మార్చడంలో స్పేస్ టెక్నాలజీ పాత్ర కీలకం : ప్రధాని మోదీ




ఢిల్లీ, ఆగస్టు 24(టుడే విదుర): :భారత పరిపాలనలో, మన దైనందిన జీవితాలను మార్చడంలో అంతరిక్ష సాంకేతికత గొప్ప భూమిక వహించబోతోందని ప్రధాని మోదీ చెప్పారు. దీనివల్ల దేశంలో ఏకీకరణ పెరుగుతోందని, పంటల బీమా.. విపత్తు నిర్వహణ నుండి మత్స్య సంపద.. మౌలిక సదుపాయాల ప్రణాళికల వరకు అనేక రంగాలపై దాని ప్రభావాన్ని ప్రధాని నొక్కిచెప్పారు.

న్యూఢిల్లీలో (శనివారం) జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగించిన ప్రధాని మోదీ, వ్యవసాయ పథకాలకు ఉపగ్రహ ఆధారిత అంచనాలు, గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ కింద జియోస్పేషియల్ మ్యాపింగ్ వంటి పురోగతులు సాధారణ పౌరులకు సురక్షితమైన, ఎక్కువ సమాచారాన్ని ఇస్తాయని, ఇది అంతరిక్ష ఆవిష్కరణలో దేశ అద్భుతమైన పురోగతిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు

## ప్రపంచం మెచ్చే నగరంగా 'అమరావతి'

**స్వర్ణాంధ్ర కావాలంటే ప్రజల ఆలోచనా విధానం మారాలి**

**అక్టోబర్ 2 నాటికి అన్ని పురపాలక సంఘాల్లో చెత్త పూర్తిగా తొలగింపు**

**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**




కాకినాడ ఆగస్టు 24 (టుడే విదుర):అమరావతిని ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామని, అమరావతితోపాటు విశాఖ, తిరుపతిలను మహానగరాలుగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. అక్టోబర్ రెండు నాటికి రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో చెత్తను పూర్తిగా తొలగిస్తామన్నారు. స్వర్ణాంధ్ర కావాలంటే ముందు ప్రజల ఆలోచనా విధానం మారాలని, రోడ్లపైన, ఇంటి ముందు చెత్త వేయడం వల్ల వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం ఆయన పర్యటించారు. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గన్నారు. తొలుత హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పెద్దాపురం పట్టణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ర్యాలీలో చంద్రబాబు పాల్గన్నారు. ప్రజావేదిక వద్దకు చేరుకుని అక్కడ జరిగిన సభలో మాట్లాడారు. గత వైసిపి సర్కారు చెత్తపై పన్ను వేసినా చెత్తను తొలగించకుండా వదిలేసిందన్నారు. రాష్ట్రాన్ని నూటికి నూరు శాతం స్వచ్ఛాంధ్రగా మారుస్తామని ప్రకటించారు. చెత్త నుంచి సంపద సృష్టిస్తామని, జిల్లాలో సేకరించిన చెత్తతో విద్యుత్తును తయారు చేస్తామని అన్నారు. ఈ మేరకు రూ.330 కోట్లతో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని, దీన్ని 18 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్‌టీఆర్ భరోసా, అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం, చేనేతకు ఉచిత విద్యుత్తు వంటి పథకాల అమలును వివరించారు. తాజాగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని విజయవంతంగా ప్రారంభించామన్నారు. దీపం పథకం పెట్టి వంట గ్యాస్‌ను ఇచ్చింది తానేనని తెలిపారు. పి-4 ద్వారా పేదరికాన్ని రూపుమాపేందుకు చర్యలు చేపట్టామన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్రం నుంచి రు.12 వేల కోట్లు మంజూరు చేయించామని, విశాఖకు రైల్వే జోన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## రూ.23 కోట్లతో కనకాయలంక కాజ్‌వే



యలమంచిలి, ఆగస్టు 24(టుడే విదుర): గోదావరి లంక గ్రామాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, వరదల సమయంలో భయపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం ఆయన పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు పడవపై వెళ్లి వరద నీటిలో నడిచారు. గ్రామస్తులను పలకరించి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్ల పాలనలో వరదలస్తే ఏరియల్ సర్వే పేరుతో వైసిపి ప్రభుత్వం గాలిలో చేసిన వాగ్దానాలు గాలిలోనే కలిసిపోయాయన్నారు. వరద సమయంలో కనకాయలంక కాజ్‌వే ముంపుతో రాకపోకలు నిలిచి ఎదురయ్యే ఇబ్బందులను శాశ్వతంగా తొలగేలా రూ.23 కోట్లతో వంతెన నిర్మిస్తామని, ఇందుకు త్వరలోనే టెండర్లు పిలుస్తారని ప్రకటించారు. ముంపు గ్రామాల ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉ ంటూ అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలిచ్చారు. అంటురోగాలు, విష జ్వరాలు వ్యాపించ కుండా వైద్య శిబిరాల ద్వారా అవసరమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయా గ్రామాల సర్పంచులు మద్దా శ్రీనివాస్, తాళ్ల నాగరాజు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టంగుటూరికి సీఎం నివాళి



అమరావతి ఆగస్టు 24 (టుడే విదుర):తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన ధీరోదాత్తుడు, త్యాగధనుడు, తెలుగు జాతి సాహసానికి ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులు అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి బాటలు పరిచిన ప్రకాశాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సీఎం పేర్కొన్నారు.

## వైసిపిది దోపిడీ సిద్ధాంతం

**ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

అమరావతి ఆగస్టు 24(టుడే విదుర): వైసిపిది దోపిడీ సిద్ధాంతమని టిడిపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీరో చక్రవర్తిలా రాష్ట్రాన్ని పాలించారని, రాష్ట్ర ప్రజల బాగోగుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. వైసిపి హయాంలో మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి చేసిన దురాగతాలు అనేకం ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వానికి వాటన్నింటిపై జవాబు చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎవరికీ లేని సమస్య దెందులూరులో అబ్బయ్యకే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దొంగకు సాయం చేయాలని చూస్తే మీరు కూడా దొంగలవుతారని హెచ్చరించారు.

## వ్యవసాయ పంపుసెట్లు, ఫీడర్లకు సోలార్ విద్యుత్తు

**5842 ఎకరాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల స్థాపన**

**'పీఎం కుసుమ్' లక్ష్యంపై డిస్కమ్‌లకు సీఎస్ ఆదేశాలు**

అమరావతి, ఆగస్టు 24 (టుడే విదుర): ప్రధానమంత్రి కుసుమ్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 2.93లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 1156 వ్యవసాయ ఫీడర్లకు సౌర విద్యుత్తు అందించాలన్న లక్ష్యాన్ని సకాలంలో నెరవేర్చాలని డిస్కమ్‌లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శనివారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో డిస్కమ్‌ల సీఎండీలు పృథ్వీతేజ్, సంతోష్‌రావు, పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఏకేవీ భాస్కర్, నెడ్‌క్యాప్ ఎండీ బి.కమలాకరబాబుతో సీఎస్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులు, విద్యుత్తు సరఫరాపై సమీక్షించారు. 5842ఎకరాల్లో 1162.8 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు.

## చేపల సాగుపైనా ట్రంప్ ఎఫెక్ట్

**రొయ్యలపై సుంకాల ప్రభావంతో చేపల సాగుకు మొగ్గిన రైతులు**

**ఇదే అదనుగా మేత ధర పైపైకి**


**10 టన్నుల డీవోబీ ధర లక్ష నుంచి 1.79 లక్షలకు పెంచేసిన వ్యాపారులు**

**ప్రభుత్వం జోక్యానికి రైతుల విన్నపం**



ఆకివీడు ఆగస్టు 24 (టుడే విదుర):అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల భారం.. ఆక్వారంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో రైతులు చేపల సాగువైపు మళ్లుతున్నారు. నిన్న మొన్నటి వరకు రొయ్యల సాగు చేపట్టిన వారు ఇప్పుడు చేపల పెంపకంపై దృష్టి పెట్టారు. అయితే, ఇప్పుడు చేపల పెంపకంపైనా ట్రంప్ ప్రభావం కనిపిస్తోంది. చేపలకు మేతగా వేసే డీవోబీ ధర ఒక్కసారిగా 79 శాతం మేరకు పెరిగిపోయింది. రెండు నెలుల కిందటి వరకు 10 టన్నుల డీవోబీ ధర రూ.లక్ష ఉండగా, ఇప్పుడు ఏకంగా 1.79 లక్షలకు చేరింది. ఇక, రెండు మాసాల కిందట ఒక చేప ధర రూ.118గా ఉండగా, ప్రస్తుతం మేత ధర పెరిగినా చేప ధర మాత్రం పెరగలేదు. దీంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ట్రంప్ సుంకాల ప్రభావంతో రొయ్యల సాగుపై ఏర్పడ్డ ప్రతి కూల పరిస్థితుల నేపథ్యంలో చేపల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికితోడు వర్షాకాలంలో రొయ్యల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించవు. దీంతో రైతులు చేపలు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఈ సాగు విస్తీర్ణం పెరిగింది. ఇదే అదనుగా భావించిన డీవోబీ వ్యాపారులు తమ ఇష్టానుసారం ధర పెంచేశారు. ప్రస్తుతం 10 టన్నుల డీవోబీ ధర రూ.లక్ష నుంచి రూ.1,79,000లకు పెరిగిపోయింది. దీంతో చేపల రైతులు లబోదిబోమంటున్నారు. చేపల సాగు సమయం 10 నుంచి 12 నెలలు. ప్రస్తుతం పెరిగిన డీవోబీ ధరలతో వ్యయం ఎక్కువ, లాభాలు తక్కువగా పరిస్థితి మారిపోయిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సహజంగా కట్లా, శీలావతి, గడ్డిచేప, మోసు వంటివి మాత్రమే సాగు చేస్తుంటారు. పేను, మెప్పు, శంఖు జలగ వంటి వ్యాధులు చేపల సాగులో అవరో?ధాలుగా ఉన్నాయి. అనేక ఇబ్బందులు ఉ న్నప్పటికి చేపలసాగు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో చేపల మేత ధర పెరిగిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని డీవోబీ ధరలు తగ్గించాలని కోరుతున్నారు.

## 7న దుర్గ గుడి మూసివేత



విజయవాడ(ఇంద్రకీలాద్రి), ఆగస్టు 24 (టుడే విదుర): చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని ప్రధాన ఆలయం, ఉపాలయాలన్నింటినీ మూసి వేస్తున్నట్టు దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ తెలిపారు. ఆ రోజు 3.30 గంటలకు కవాట బంధనం చేయనున్నట్టు వైదిక కమిటీ తెలిపిందని శనివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి తిరిగి భక్తులకు దర్శనం ఉంటుందని తెలిపారు.

# 34 మందితో పార్లమెంటు కమిటీలు



## 6న సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సమీక్షలో టిడిపి అధినేత చంద్రబాబు వైసిపి విష వృక్షమని విమర్శ

అమరావతి ఆగస్టు 24(టుడే విదుర):టిడిపి పార్లమెంటు కమిటీలను 34 మంది సభ్యులతో ఏర్పాటు కావాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. పార్లమెంటు పార్టీ కమిటీల ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలతో ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం సమావేశమయ్యారు. అధ్యక్షులుతో పాటు ఏడుగురు ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యదర్శులతో పార్లమెంటు కమిటీ ఉండాలని చంద్రబాబు తెలిపారు. పార్లమెంటు కమిటీల నియామకం అత్యంత పారదర్శంగా, పకడ్బందీగా జరగాలని ఆదేశించారు. కమిటీ నియామకంలో సోషల్ రీ ఇంజినీరింగ్ జరగాలని, అన్ని వర్గాల్లో బలమైన నేతలకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. డమ్మీలు, వీక్‌గా ఉండే వాళ్లను పెడితే ప్రభుత్వ, పార్టీ నష్టపోతాయని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు పార్టీ నేతలు మరింత బాధ్యతగా ఉండాలని సూచించారు. యువతకు అవకాశాలు ఇస్తున్నామన్నారు. సూపర్ సిక్స్‌లో చెప్పినట్లు అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని, సెప్టెంబరు 6న అనంతపురంలో హిట్ కార్యక్రమం నిర్వహిద్దామన్నారు. మేనిఫెస్టోలో అనేక హామీలు ఇప్పటికే నెరవేర్చామని, పథకాలు సకాలంలో అమలు వల్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి వర్గానికి ఏదో ఒక లబ్ధి చేకూర్చామని, ఏడాది కాలంలో ఈ పనులు చేయడం గొప్ప ముందడుగు అని తెలిపారు. ప్రజల్లో ఉన్న సానుకూలతను పెంచుకునేలా పార్టీ నేతలు ప్రజల్లో తిరుగుతూ వారితో మమేకమవ్వాలని చెప్పారు. వైసిపి ఒక విష వృక్షమని విమర్శించారు. ప్రజల సమస్యలు, ప్రజల ప్రయోజనాలు వాళ్లకు అనవసరమన్నారు. సంక్షేమ పథకాలపై చర్చ జరగకూడదనేది వైసిపి ప్రధాన లక్ష్యమన్నారు. అర్హుల పింఛన్లు తొలగించలేదని, కానీ వైసిపి మాత్రం లక్షల పింఛన్లు తొలగించినట్లు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారాలతో నిత్యం వాళ్ల రాజకీయాలు సాగుతున్నాయని, ప్రజలకు మనం వాస్తవాలు చెబుతూనే ఉండాలని చెప్పారు. వైసిపి విధానాలను, కుట్రలను ఉదాహరణలతో చెబితే ప్రజలు అర్థం చేసుకుంటారని తెలిపారు. తప్పుడు ప్రచారాలపై మౌనంగా ఉండకూడదన్నారు. పార్టీపై దృష్టిపెట్టి బలోపేతం చేసుకోవాలని, టిడిపి సంస్థాగతంగా చాలా బలంగా ఉంటుందన్నారు. పార్టీ, ప్రభుత్వ ఇమేజ్‌ను పెంచేలా నేతల తీరు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మంత్రులు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ స్థితికి గోదావరి



యంత్రాంగం,ఆగస్టు 24(టుడే విదుర) : మూడు రోజులుగా ఉగ్రరూపాని ప్రదర్శించిన గోదావరి శనివారం నాటికి పూర్తిగా తగ్గింది. భద్రాచలం, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ప్రస్తుతం సాధారణ స్థాయిలో ప్రవాహం ఉంది. భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రికే నీటి ప్రవాహం తగ్గడంతో అక్కడ అన్ని ప్రమాద హెచ్చరికలను అధికారులు ఉపసంహరించారు. ప్రస్తుతం అక్కడ 36.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. భద్రాచలం వద్ద తగ్గినప్పటికీ ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం వరకూ ప్రవాహం కొనసాగింది. రాత్రి ఏడు గంటల తరువాత 11.70 అడుగులకు నీటి మట్టం చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరించారు. కాటన్ బ్యారేజీ నుంచి 9,83,312 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. చింతూరు వద్ద శబరి 30 అడుగులకు చేరుకుని సాధారణ స్థాయికి వచ్చింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు ప్రారంభమయ్యాయి. సోకులేరు వాగు తగ్గకపోవడంతో చింతూరు– విఆర్.పురం మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడలేదు. విఆర్.పురం మండలం రేఖపల్లిలోని పునరావాస కేంద్రాన్ని సిపిఎం ఎంపిపి కారం లక్ష్మి పరిశీలించారు. బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



విశాఖపట్నం, ఆగస్టు 24(టుడే విదుర): విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) డిమాండ్ చేసింది. ఇటీవల ఒకేసారి కీలకమైన 34 విభాగాలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన ఇచ్చారని, ఇది నిబంధనలకు విరుద్ధమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉక్కు ఉత్పత్తి అతి ప్రమాదకరమైన పరిశ్రమ అని, అన్నిరకాలుగా శిక్షణ పొందిన వారే దానిని నడపాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఫార్మా సిటీల్లో ప్రమాదాలు జరుగుతున్నట్టు ఇక్కడ కూడా ప్రమాదాలు జరుగుతాయని హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధులు కేవీ జగన్నాథరావు, వీఎస్ కృష్ణ పేర్కొన్నారు. అదే విధంగా కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తొలగించారని, తక్షణమే వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణాలు త్యాగం చేస్తే విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటైందని, దానిని ప్రైవేటు సంస్థల కోసం నిర్వీర్యం చేయడం తగదని మానవ హక్కుల వేదిక పేర్కొంది.


# మెగా డీఎస్సీ మెరిట్ జాబితాలు విడుదల

## రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన మహిళా అభ్యర్థులు త్వరలో సర్టిఫికెట్ల పరిశీలనఅనంతరం పాఠశాలల్లోకి



అమరావతి,ఆగస్టు 24(టుడే విదుర): మెగా డీఎస్సీ-2025 అభ్యర్థులకు సంబంధించిన మెరిట్ జాబితాలను పాఠశాల విద్యాశాఖ రాత్రి విడుదల చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ), పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), ప్రిన్సిపాల్ పోస్టులకు వేర్వేరుగా జాబితాలు ప్రకటించింది. 16,347 పోస్టులతో డీఎస్సీ ప్రకటించగా 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 3,12,500(92.9 శాతం) మంది పరీక్షలు రాశారు. పోస్టులు, కేటగిరీల వారీగా పాఠశాల విద్యాశాఖ వారి ర్యాంకులు ప్రకటించింది. వీటి ఆధారంగా ఆయా జిల్లాల్లో అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచి, ఉద్యోగాలకు ఎంపిక చేయనుంది. మెరిట్ జాబితాల ఆధారంగా 'ఉద్యోగాలకు పరిగణనలోకి తీసుకునే అభ్యర్థుల'ను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు.

# హైదరాబాద్ కిడ్నీ రాకెట్ కేసులో విశాఖ వైద్యుడు




విశాఖపట్నం, ఆఆగస్టు 24(టుడే విదుర): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన హైదరాబాద్ (సరూర్‌నగర్) కిడ్నీ రాకెట్ వ్యవహారంలో విశాఖపట్నానికి చెందిన వైద్యుడిని సీఐడీ అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకూ 19 మందిని అరెస్టు చేసినట్టయింది. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన పవన్ అనే వ్యక్తిది కూడా విశాఖపట్నమే. ఆయనను ఇప్పటికే అరెస్టు చేయగా.. నగరానికి చెందిన డాక్టర్ వెంకటరామ సంతోషనాయుడిని సీఐడీ అదుపులోకి తీసుకుంది. సరూర్‌నగర్ కిడ్నీ రాకెట్ వ్యవహారం ఈ ఏడాది జనవరిలో వెలుగుచూసింది. కిడ్నీ ఇచ్చిన ఒకరు... ముందుగా చెప్పినట్టు డబ్బు చెల్లించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు విచారణలో కళ్లు బైర్లుకమ్మే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న, నిరుపేదలను లక్ష్యంగా చేసుకుని ఒక ముఠా పెద్దఎత్తున కిడ్నీ రాకెట్‌ను నడిపినట్టు పోలీసులు గుర్తించారు. తవ్వుతున్న కొద్దీ అక్రమాలు వెలుగులోకి రావడంతో ఈ కేసును సీఐడీ (తెలంగాణ)కి అప్పగించారుఈ కిడ్నీ రాకెట్ వ్యవహారంలో విశాఖకు చెందిన పవన్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహరించాడు. హైదరాబాద్‌లో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆస్పత్రులను గుర్తించిన పవన్ వాటిల్లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించాడు. అలకనందతోపాటు మరో ఆస్పత్రిలో ఈ తరహా శస్త్రచికిత్సలు జరిగాయి. కిడ్నీ అవసరమైన వ్యక్తులను, వారికి కిడ్నీలు ఇచ్చేవారిని దళారులు, ఏజెంట్ల ద్వారా పవన్ గుర్తించేవాడు. ముఖ్యంగా తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల వారిని తీసుకొచ్చి వారి నుంచి కిడ్నీలు తీసుకునేవాడు. అందుకు వారికి రూ. 5 లక్షలు, ఆస్పత్రికి, వైద్యులకు మరో రూ. 15 లక్షలు చెల్లించేవాడు. కొంత మొత్తం దళారులకు ఇచ్చేవాడు. పవన్‌కు సుమారు రూ. 25 లక్షల వరకూ మిగిలేది. ఇలా పదుల సంఖ్యలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు సీఐడీ గుర్తించింది. డాక్టర్ వెంకటరామ సంతోషనాయుడు విశాఖ నుంచి వెళ్లి ఈ శస్త్రచికిత్సలు నిర్వహించేవారు. ఈ కిడ్నీ రాకెట్‌లో డాక్టర్ వెంకటరామ కీలకంగా వ్యవహరించినట్టు సీఐడీ అధికారులు నిర్ధారణకు రావడంతో ఆయనను అరెస్టు చేశారు.

# రోజుకు 21 లక్షల మంది ఉచిత ప్రయాణం



పొన్నూరుటౌన్, ఆగస్టు 243(టుడే విదుర):రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రతి రోజూ 21 లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని పొందుతున్నారని ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరు ఆర్టీసీ డిపోను ఆయన స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో కలిసి సందర్శించారు. డిపోలోని సమస్యలపై ఆరా తీసి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకంలో ప్రస్తుతం 60 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. నష్టం వచ్చినా ప్రభుత్వ లక్ష్యాలను అందుకునేలా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. త్వరలో 1050 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు. మరో 1500 బస్సులు సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 1500 మందిని కారుణ్య నియామకాల కింద నియమించుకున్నామన్నారు. పెన్షను సైతం పెంచామని తెలిపారు.

# వ్యర్థాల పునర్వినియోగంతో పర్యావరణానికి మేలు



అమరావతి,ఆగస్టు 24(టుడే విదుర): రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలు, వ్యవసాయ, ఉద్యాన, పాడి, మత్స్య పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చవచ్చని, ఆ దిశగా అడుగులేస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. విజయవాడలోని పీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. వ్యర్థాలను వినియోగించుకుని ఉపాధి పెంచుకుంటూ, ఆర్థికంగా ఎదిగేందుకు మంచి అవకాశాలెలా కల్పించాలి..? అన్న అంశాలపై చర్చించారు. ఈ వర్క్‌షాపనకు వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పీసీబీ సభ్యకార్యదర్శి శరవణన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు హాజరయ్యారు. వ్యవసాయం, ఆక్వా, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ తదితర రంగాల్లో ఏ మేరకు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి? వాటిని ఎలా నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయో ఆ శాఖల అధికారులు వివరించారు. పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, ఇతర నిపుణులు తమ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను చర్చించారు. పీసీబీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన రీసైక్లింగ్ పాలసీ ద్వారా పర్యావరణ అనుకూల పరిశ్రమలు రాష్ట్రానికి ఎక్కువగా వస్తాయి. రీసైక్లింగ్‌కు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా అనుబంధ పరిశ్రమలు రాష్ట్రంలో ఎక్కువగా పెట్టేందుకు అవకాశం ఉంది' అని తెలిపారు.

# 840 బార్లు... 19 దరఖాస్తులే



అమరావతి, ఆగస్టు 24(టుడే విదుర): ఎక్సైజ్‌శాఖ విడుదల చేసిన నూతన బార్ పాలసీకి స్పందన కరువైంది. రాష్ట్రంలోని 840 బార్లకు ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ చేయగా, వరకు ఐదు రోజుల్లో 19 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వివిధ జిల్లాల్లో సుమారు 250 మంది ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 19 మంది మాత్రమే రూ.5 లక్షలు చెల్లించి తుది దరఖాస్తులు సమర్పించారు. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ పలు మార్పులు చేసింది. నిబంధనల ప్రకారం ప్రతి బార్‌కు 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఫీజు వెనక్కి ఇవ్వరు. దీనిపై వ్యతిరేకత రావడంతో ఆ నిబంధనను సవరించారు. లాటరీ తీయకపోతే దరఖాస్తుదారులకు ఫీజు వెనక్కి ఇస్తామని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రకటించారు.

# యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి



నంద్యాల ఎడ్యుకేషన్,ఆగస్టు 24(టుడే విదుర):: యూరియాపై వ్యవసాయాధికారులు రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్‌లు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతు లు యూరియా విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చారు. గత ఖరీఫ్ సీజన్ కంటే ఈ ఏడాది ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని, రైతులు అపోహలతో యూరియాను అధికంగా కొను గోలు చేసి నిల్వ ఉంచుతున్నారన్నారు. ఈ మేరకు రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా విజిలెన్స్ అధి కారులు నిఘా పెట్టాలన్నారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల విని యోగం గణనీయంగా పెరిగిందన్నారు. రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్‌ఫెడ్‌కు 50 నుంచి 70శాతం ఎరువుల కేటాయింపులను పెంచామన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పెన్నాలో జోరుగా నీళ్లు.. గ్రామాల్లో నీటి కష్టాలు



జమ్మలమడుగు, ఆగస్టు 24(టుడే విదుర)పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తున్నా జమ్మలమడుగు పరిసర ప్రాంతాల గ్రా మాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్ప డంలేదు. గత 15 రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో వర్షాలు అధికంగా కురిసి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ, ఆపై గండికోట ప్రాజెక్టు, అక్కడి నుంచి మైలవరం జలాశయం, పెన్నానదిలో వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. జూన్, జూలై మాసాల్లో వర్షాలు లేక రైతులు, ప్రజలు వర్షం కోసం ఎదురుచూశారు. తర్వాత ఆగస్టు నెలలో ఆలస్యంగానైనా వర్షాలు బాగాపడడంతో మైలవరం జలాశయం నుంచి ప్రతిరోజు పది వేల క్యూసెక్కులకుపైగా వరద ప్రవాహం కొనసాగుతుంది. అయితే మైలవరం, వేపరాల దొమ్మరనంద్యాల, మోరగుడి, పొన్నతోట, గూడెం చెరువు, అంబవరం, గొరిగెనూరు, తదితర గ్రామాలకు మంచినీటి కోసం పెన్నానదిలో ఏర్పాటు చేసిన బోర్లకు వరద ప్రవాహంతో అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయతీల అధికారులు బోర్ల వద్ద పైపులు, విద్యుత వైర్లు తొలగించడంతోఆ గ్రామాలకు మంచినీటి సరఫరా ఆగిపోయింది. ప్రజలు సమీప పొలాల్లో బోర్ల వద్ద నీళ్లను తెచ్చుకుంటున్నారు. దొమ్మరనంద్యాల గ్రామంలో గ్రామ పంచాయతీవారు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నా అవి పూర్తిగా సరిపోవడంలేదని దీంతో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పెన్నానదిలో వరద ప్రవాహం తగ్గే వరకు తాగు నీటి కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మైలవరం జలాశయం వద్ద నుంచి జమ్మలమడుగుపట్టణ ప్రాంతానికి మంచినీటి సరఫరా చేసే మున్సిపల్ ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంకు నుంచి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా పెన్నానది వరద ప్రవాహంతో వేపరాల నుంచి జమ్మలమడుగు వెళ్లే రహదారులు కోతకు గురయ్యాయి. అలాగే దానవులపాడు వద్ద పెన్నానదిలో రోడ్డు కోతకు గురైంది.

# టమోటా కోసం చెరువులో నీరు వృథా

## నీటిని బయటికి పంపేందుకు తీసిన కాల్వ



ఆగస్టు 24(టుడే విదుర):చెరువు భూమిని ఆక్రమించి అందులో సాగు చేసిన టమోట సాగును రక్షించుకునేందుకు చెరువు తూమును తొలగించి నీటిని వదిలేసినట్లు రెవెన్యూ అధి కారులకు ఫిర్యాదు అందింది. ఎగువ ఆవులకుంట చెరువు భూ మిని ఆక్రమించిన ఒకరు టమోట పంట సాగు చేశాడు. ఇటీవ ల కురిసిన వర్షాలకు చెరువులోకి నీరు చేరింది. ఈ నీరు నిల్వ వుంటే తన పంట పాడైపోతుందని ఆక్రమణదారుడు ఏకంగా చెరువు తూమును తొలగించి నీటిని బయటకు పంపేశాడు. ప్రొక్లైనర్‌తో తూము నుంచి కాల్వ తీసి మొత్తం నీటిని ఖాళీ చేయించాడు. దీంతో పలువురు ఆయకట్టు రైతులు మాట్లాడు తూ అధికారులు వెంటనే చెరువును పరిశీలించి మరమ్మతులు చేయించి ఆక్రమణ దారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అక్రమంగా తీసిన కాల్వలను పూడ్చేయాలని కోరారు. స్థానిక టీడీపీ నేత వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారుకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

# కన్నయ్య వెంటే కన్నతల్లి



కంచికచర్ల/రూరల్,ఆగస్టు 24(టుడే విదుర): విజయవాడకు చెందిన నవీన్, చైతన్యకు 2024లో వివాహమైంది. నవీన్ ఆటోడ్రైవర్. వీరిద్దరికీ మూడు నెలల కిందట బాబు జన్మించాడు. అద్విక్ అని నామకరణం చేశారు. తల్లి చైతన్య తన మూడు నెలల అద్విక్‌తో కానూరులోని తల్లి మరియమ్మ ఇంట్లో ఉంటోంది. గత శనివారం కృష్ణాష్టమి సందర్భంగా బాబును కృష్ణుడిగా అలంకరించి మురిసిపోయింది. బాబుకు మూడో నెల రావటంతో కంచికచర్ల మండలం కీసర గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ రేణుక ఇంట్లో ఒకరోజు నిద్ర చేయాలనుకున్నారు. ఉదయం కానూరు నుంచి తల్లి మరియమ్మ, అద్విక్‌తో కలిసి చైతన్య ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. బస్సు కీసర శివారుకు చేరుకోగానే మరియమ్మ తన అక్క రేణుకకు ఫోన్ చేసి.. చైతన్యతో పాటు బాబును తీసుకెళ్లడానికి ఏదైనా బండి పంపమని అడిగింది. తన ఇంటి సమీపంలో ఉన్న శ్రీరామ్ అనే యువకుడికి బైక్ ఇచ్చి వారిని తీసుకురమ్మని రేణుక తెలిపింది. టోల్‌గేట్ వద్ద బస్సు దిగాక చైతన్య, బాబును తీసుకుని మోటార్ సైకిల్ ఎక్కింది. మోటారు సైకిల్ పెండ్యాల రూట్‌లోకి వెళ్లే క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బలమైన గాయాలు కావడంతో మూడు నెలల అద్విక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తల్లి చైతన్యకు బలమైన గాయాలు కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. శ్రీరామ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విగతజీవులుగా మారిన చైతన్య, అద్విక్‌లను చూసి తల్లి మరియమ్మ, ఇతర బంధువులు గుండెలవిసేలా రోదించారు. కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పాము కాటుకు గురై రైతు మృతి

అద్దంకి,ఆగస్టు 24(టుడే విదుర): పాముకాటుకు గురై రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తిమ్మనపాలెం గ్రామం లో ఉదయం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు(40) ఉదయం పొలానికి పశువుల మేత కోసం వెళ్లాడు. అక్కడ పాము కరవడంతో కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించి, నేరుగా అద్దంకిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వచ్చాడు. అక్కడ వారు వైద్యం నిరాకరించడంతో అదే వాహనం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి అక్కడే కుప్పకూలాడు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

# క్విస్ విద్యార్థుల రక్తదానం



ఆగస్టు 24(టుడే విదుర):ఒంగోలు రక్తదానం చేసిన 110 మంది విద్యార్థులుఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 110 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. దాది ప్రకాశమణీ 18వ వర్ధంతి సందర్భంగా భారతదేశం, నేపాల్ రెండు దేశాల్లో కలిపి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 100 గంటలలో అనగా 2లక్ష యూనిట్లు సేకరిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ తెలియజేశారు. దాంట్లో భాగంగా క్విస్ ఇంజనీరింగ్ కళాశాల వారి సహకారంతో ఇక్కడ కూడా శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సృష్టించే దిశగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా క్విస్ కళాశాల యాజమాన్యానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థుల్లో సేవాభావం నింపే ఇలాంటి కార్యక్రమాలు చేయడం అద్భుతం అని కొనియాడారు.

# 108 వాహనంలో గర్భిణి ప్రసవం



మొగల్తూరు ఆగస్టు 24(టుడే విదుర): 108 వాహనంలో గర్భిణీ బిడ్డను ప్రసవించింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముత్యాలపల్లి మోడీ గ్రామానికి చెందిన దుర్గ భవాని తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. ఆ ప్రాంతానికి చేరుకున్న 108 సిబ్బంది దుర్గ భవానిని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలిస్తూ ఉండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికంగా రావడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఇ.సంజీవ్ కుమార్ ఆమెకు ప్రసవం చేయించి ఆస్పత్రికి తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అత్యవసర వాహన సిబ్బంది తెలిపారు.


# సీఎంగారూ.. ఇదీ సమస్యల తీరు!



**◆ ఏలేరు రిజర్వాయర్ ◆ నేడు సీఎం చంద్రబాబు పర్యటన**
**◆ తీసుకెళ్లేలా కలెక్టర్ నివేదిక ◆ జీజీహెచ్‌కు రూ.500 కోట్లకు వినతి**
**◆ స్మార్ట్‌సిటీకి రూ.186 కోట్లు కావాలి ◆ జయలక్ష్మి బాధితులకు న్యాయం**

ఆగస్టు 24(టుడే విదుర):కాకినాడ జిల్లాను ఎన్నో ఏళ్లుగా పలు కీలక సమస్యలు వెక్కిరిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిధులు మంజూరవక పరిష్కారం కోసం ఎదురుచూస్తు న్నాయి. వీటిని పట్టాలెక్కించి నిధులు విడుదల చేస్తేనే వాటికి మోక్షం. అయితే సీఎం చంద్రబాబుకు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక ప్రేమ ఉన్న నేపథ్యంలో వీటి పూర్తికి నిధులు విడుదల చేస్తారని అంతా ఆశిస్తున్నారు. నేడు సీఎం పెద్దాపురం పర్యటనకు వస్తుండడంతో ఆయన దృష్టికి పలు కీలక సమస్యలను తీసుకువెళ్లి నిధులు కోరేందుకు జిల్లా కలెక్టర్ శాన్‌మోహన్ నివేదిక సిద్ధం చేశారు. ముఖ్యంగా ఏలేరు ఆధునికీకరణ, ఉమ్మడి తూ.గో.జిల్లాకు కీలక మైన జీజీహెచ్ అభివృద్ధి, కాకినాడ స్మార్ట్‌సిటీకి నిధుల బెంగ తీర్చడం, ఉప్పాడ సముద్రపు కోత నివారణ, జయలక్ష్మి సొసైటీ ఆస్తులను వేలం వేయించి డిపాజిటర్లకు న్యాయం చేయడం వంటి పలు ప్రధాన అంశాలను పర్యటనలో సీఎంకు వివరించనున్నారు. అటు ముఖ్యమంత్రి కూడా నేటి పర్యటనలో జిల్లాకు వరాలు కురిపించే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఫ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పేదలకు పెద్దదిక్కు జీజీహెచ్‌లో ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. విని యోగానికి పనికిరావని ఇంజనీర్లు అనేక సార్లు నివేదిక లిచ్చినా నిధుల్లేక అదే భవ నాల్లో వైద్యసేవ లందిస్తున్నారు. కొత్త బ్లాకుల నిర్మాణానికి రూ.500 కోట్లు నిధులివ్వాలని కలెక్టర్ కోరబోతున్నారు.ఫ కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏటా కేంద్రం రూ.100 కోట్ల నిధులిస్తుంది. అదే స్థాయిలో రాష్ట్ర ప్ర భుత్వం తన వంతు ఏటా ఇంకో రూ.100 కోట్లు సమకూర్చాలి. కానీ గత వైసీపీ ఈ నిధులను విడుదల చేయకుండా స్మార్ట్‌సిటీని ముప్పు తిప్పలు పెట్టింది. దీంతో స్మార్ట్‌సిటీ దివాళా స్థితిలో ఉం ది. అటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇంకా రూ.186 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నా ఇవి విడుదల కాలేదు. ఈ నిధులు విడుదల చేస్తే అభివృద్ధి పనులు వేగవంతమ వుతాయి.ఫ కాకినాడ కేంద్రంగా జయలక్ష్మి సొసైటీ బ్యాంకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.520 కోట్ల మేర డిపాజిటర్లను మోసం చేసింది. దీంతో సీఐడీ రంగంలోకి దిగి సంస్థ ఆస్తులను సీజ్ చేసింది.కానీ ఇప్పటికీ బాధి తులకు న్యాయం జరగలేదు. సీజ్ చేసిన రూ.450 కోట్ల విలువైన ఆస్తుల్లో కొంతైనా వేలం వేసి చిన్న డిపాజిటర్లకు డబ్బులు చెల్లించే వీలున్నా సీఐడీ కనీసం ఆ దిశగా ప్రయత్నం చేయకపో వడంతో బాధితులు అల్లాడుతున్నారు.కనీసం 40 శాతమైనా నష్టపోయిన వారికి చెల్లించడానికి రూ.200 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్ శాన్ మోహన్ సీఎంను కోరనున్నారు.ఫ కాకినాడ ఉప్పుటేరుపై సుమారు ఏడేళ్ల కిందట శంకుస్థాపన చేసిన మూడో వంతెన నిర్మాణంపై ఇప్పటికీ కలగానే మిగిలింది. కాకినాడలో వాహనాల రద్దీ తగ్గించేందుకు పాత పోర్టు రైల్వే స్టేషన్ నుంచి ఏటిమొగ మీదుగా యానాం రోడ్డుకు కలిసేలా ఉప్పుటేరుపై రూ.146 కోట్లతో మూడో వం తెన నిర్మాణానికి 2018 నవంబర్ 26న శంకు స్థాపన చేశారు.ఆ తర్వాత వైసీపీ అధికా రంలోకి రావడంతో నిర్మాణం మూలన పడింది. ఏడీబీ రోడ్ నుంచి పోర్టు మీదుగా ఎన్‌హెచ్ 216 రహదారికి కలిసే ఈ వంతెన నిర్మాణం వల్ల నగరంలో వాహనాల రద్దీ తగ్గనుంది. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణా నికి నిధులు మంజూరు కోరుతూ కలెక్టర్ తన నివేదికలో ప్రస్తావించారు.ఏలేరుతోనే మోక్షం...గతేడాది ఏలేరు వరదలతో తొమ్మిది మండలాల్లో కాలువలకు 60 చోట్ల గండ్లు పడ్డాయి. కేవలం పదివేల క్యూసెక్కుల వరదను మాత్రమే తట్టుకోగలిగే సామర్థ్యం ఉన్న కాలువల్లోకి 47వేల క్యూసెక్కుల వరద వచ్చి పడడంతో తొమ్మిది మండలాలు నష్ట పోయాయి. ఏలేరు వరద కారణంగా 34,812 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిం ది. మొత్తం 24,879 మంది రైతులు నష్టపోయారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం ఏలేరు ఫేజ్1 పూర్తికి రూ.142 కోట్లు, ఫేజ్2 పూర్తికి 150 కోట్లు ఇస్తానని మోసగించింది. ఈలోపు సవరించిన అంచనాలు రూ.663 కోట్లకు చేరుకున్నాయి.గతేడాది సీఎం చంద్ర బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తా మని హామీ నేపథ్యంలో నిధులు మంజూ రు చేయాలని కలెక్టర్ కోరబోతున్నారుఉప్పాడ వద్ద సముద్రం అంతకంతకూ ముందుకు వస్తూ కలవరపెడుతోంది. ఇప్పటి వరకు సముద్రగర్భంలో 1,360 ఎకరాలు కలిసిపోయింది.ఈ నేపథ్యంలో కోతను నివారి స్తామని ఎన్నికలప్పుడు కూటమి హామీ ఇచ్చి ంది.ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పవన్ కల్యాణ్ స్వయంగా కోతను పరిశీలించారు. ఎన్‌సీఆర్‌సీ శాస్త్రవేత్తలతో ప్రత్యేక అధ్య య నం చేయించారు.కోత నివారణకు ప్రత్యేక కాంక్రీట్‌గోడ నిర్మించాలని వీరు తేల్చారు. 12 కిలోమీటర్ల మేర ఈ కోత నివారణ ప్రణా ళి కకు రూ.250 కోట్ల వరకు వ్యయం అవు తుందని అంచనావేశారు.ఈ నేపథ్యంలో కోత నివారణ పనులు ప్రారంభించ డానికి నిధు లు మంజూరు చేయాలని కలెక్టర్ తన నివేదికలో ప్రస్తావించారు.ఇప్పటికే కేంద్రం సైతం నిధులు ఇవ్వడానికి దాదాపు నిర్ణయా నికి వచ్చింది.దీంతో ఆ ప్రతిపాదనలు వే గంగా కదిలేలా సీఎంకు విన్నవించనున్నారు.

# గోదావరి తగ్గుముఖం




వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, ఆగస్టు 24(టుడే విదుర)::గోదావరి వరద తగ్గుముఖం పట్టడం తో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద వరద క్రమేపీ తగ్గుతున్నా గ్రామాలను వరద వీడడం లేదు. ఇప్పటికి వేలేరుపాడు మండలంలో 23 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి పోగా అత్యవసర పనుల నిమిత్తం ఆయా గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. వరద బాధిత కుటుంబాలకు ఐటీడీఏ పీవో రాములు నాయక్ నిత్యావసర వస్తువులు, కూరగాయలు అంద జేశారు. ఆయా గ్రామాలకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీలో గొమ్ముగూడెం, లచ్చి గూడెం, రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఉండటంతో వారికి జడ్పీ సీఈవో శ్రీహరి చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, కూర గాయలు పంపిణీ చేశారు. కౌండిన్యముక్తి, గ్రామ స్థులకు కూరగాయలు పంపిణీ చేశారు. పునరావాస కాలనీలో తాగునీటి సమస్య లేకుండా వాటర్ ట్యాంకులతో తాగునీందిస్తున్నారు. తహసీల్దార్ రమేశ్ బాబు కూరగాయల పంపిణీపై పర్యవేక్షణ చేశారు. పోలవరం వద్ద గోదావరిలో నీటిమట్టం అనూహ్య రీతిలో పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి. కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునిగాయి. వరద జలాల ఉధృతికి పట్టిసీమ ఫెర్రీ రేవు పాత సచివాలయ భవనం వద్ద గట్టు కోతకు గురవుతోంది. పట్టిసీమ రివర్ ఇన్ అతి?థి గృహం వద్ద, పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం రేవు వద్ద, గూటాల తాడిపూడి గ్రామాల మధ్య ఇసుక ర్యాంపు కోసం ఏటిగట్టుకు గండ్లు చేసిన ప్రాంతాలు ప్రమాద కరంగా మారాయి.

# రహదారులు బురదమయంతో అవస్థలు



హుకుంపేట ఆగస్టు 24(టుడే విదుర): బూర్జ పంచాయతీ పరిధిలోని తుంబవలస గ్రామ రహదారి పనులు రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు పూర్తికాలేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి మరింత దెబ్బతింది. గ్రామానికి వెళ్లే మార్గం మట్టి దారి గోతులు ఏర్పడటంతో నిత్యావసర సరుకులు తెచ్చుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య కేంద్రానికి చేరుకోవడం కష్టసాధ్యమైపోయింది. వాహనాలు నడవని పరిస్థితిలో గ్రామస్తులు బండ్లను నెట్టుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇదే ప్రధాన రహదారి కావడంతో ఎటు వెళ్ళాలన్నా కష్టతరంగా మారుతుందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుంబవలస గ్రామంలో బీట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. చింతపల్లి: చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ పరిధిలోని ఎర్రవరం జలపాతానికి వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారికి అనేక చోట్ల గండిపడి లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు మట్టి రోడ్డు కావడంతో బురదమయంగా మారింది. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా గొందిపాకల, సమగిరి, ఎర్రవరం, తాటిపాకలతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఎటు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సేవలకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. రోగులు సమయానికి ఆసుపత్రులకు చేరుకోలేక ప్రాణాల ముప్పును ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి. రహదారి మరమ్మతులకు అధికారులు హామీ ఇస్తారు కానీ పనులు ప్రారంభం కావడం లేదు. చిన్న చిన్న గండులు పెద్ద రంధ్రాలుగా మారి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇలాగే వదిలేస్తే వాహనాలు తిరగలేని స్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

# కాలేజీలో పెట్టిన ఆప్షన్లే ఫైనల్



అమరావతిఆగస్టు 24(టుడే విదుర): డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇటీవల ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారీచేయగా, ఇప్పుడు ఆఫ్‌లైన్‌లోనూ అవకాశం కల్పించినట్లు తెలిపింది. తాజా మార్గదర్శకాల ప్రకారం... విద్యార్థి అడ్మిషన్ కోరుకున్న కళాశాలకు వెళ్లి.. కాలేజీ లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అందుబాటులో ఉన్న కోర్సులను తనకు నచ్చినట్లుగా ఎంపిక చేసుకోవచ్చు. ఆ తర్వాత మరో కాలేజీకి వెళ్లి కూడా మాన్యువల్‌గా దరఖాస్తు సమర్పించవచ్చు. అయితే చివరిసారిగా వెళ్లిన కాలేజీనే తొలి ప్రాధాన్యత అవుతుంది. మొదటగా దరఖాస్తు చేసుకున్న కాలేజీ చివరి ఆప్షన్ అవుతుంది. అలాగే విద్యార్థులు మాన్యువల్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేయొచ్చు. అయితే కాలేజీలకు వెళ్లి చేసిన దరఖాస్తులే మొదటి ప్రాధాన్యత అవుతాయి. విద్యార్థి ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, తర్వాత ఆఫ్‌లైన్‌లో చేసినా.. తొలి ప్రాధాన్యత ఆఫ్‌లైన్ కాలేజీలే అవుతాయి. మరోవైపు ఆఫ్‌లైన్ విధానంలో కాలేజీల్లో పెట్టుకున్న ఆప్షన్లను విద్యార్థులు మార్చుకొనేందుకు అవకాశం లేదు. సాధారణంగా డిగ్రీకి తొలుత ఆప్షన్లు పెట్టుకున్న తర్వాత కాలేజీలు, కోర్సుల ప్రాధాన్యత మార్చుకోవచ్చు. కానీ కొత్త విధానంలో అది కుదరదు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు రూపాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్ విధానంలో పెట్టుకున్న ఆప్షన్లను మాత్రమే మార్చుకోగలరు. అయితే ఈ విధానంలో విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉంటుంది. ఏదైనా కాలేజీకి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే ఆ తర్వాత దానిని మార్చుకోవడం సాధ్యం కాదు. పైగా ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా ఆఫ్‌లైన్ దరఖాస్తుకే తొలి ప్రాధాన్యత లభిస్తుంది.

# కార్మికశాఖ జేసీ ఇంట్లో ఏసీబీ తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు 24(టుడే విదుర): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో కర్నూలు కార్మిక శాఖ జాయింట్ కమిషనరు (జేసీ) బాలు నాయక్ ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతిలోని రాఘవేంద్రనగర్‌లో ఈయన నివాసం ఉంటున్నారు. ఈ ఇంటితో పాటు కర్నూలులోని కార్యాలయం, అద్దె ఇల్లు, కుటుంబీకులు, బంధువుల ఇళ్లు, అన్నమయ్య జిల్లాలోని పౌల్ట్రీ ఫారంతో పాటు తొమ్మిది ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేశారు. తిరుపతిలోని ఇంట్లో తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. బాలునాయక్ కుమారుడు నిర్వహిస్తున్న ఆర్‌సీ సర్జికల్ షాపులోనూ తనిఖీలు చేశారు. ఇంట్లో పలు కీలక రికార్డులు, బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆయన స్వగ్రామమైన రాయచోటి సమీపంలోని బిడికి తాండా, రాయచోటి, మదనపల్లె, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇళ్లు, అపార్టుమెంట్లు, పౌల్ట్రీ ఫారాలు, భూములకు సంబంధించి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సంబేపల్లిలో ఆయనకు పౌల్ట్రీఫారం ఉన్నట్లు గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల గురించీ ఆరా తీశారు. కర్నూలు కేంద్రంగా కార్యాలయం వున్నప్పటికీ తిరుపతిలోని ఇంటి నుంచే అన్ని కార్యకలాపాలు నిర్వహించే వారని ఆరోపణలున్నాయి. కాగా, స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్లు, కీలక రికార్డులనులోతుగా పరిశీలిస్తున్నారు. ఈ సోదాలు కొనసాగనున్నాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ చెప్పారు.

# ఏసీ కోచ్‌లలో గంజాయి స్మగ్లింగ్!



హైదరాబాద్, ఆగస్టు 24(టుడే విదుర):ఎవరికీ అనుమానం రాకుండా సరికొత్త ట్రాలీబ్యాగులతో ఏసీ కంపార్ట్‌మెంట్లలో ప్రయాణి స్తూ.. గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాకు చెందిన నలుగురు కొరియర్లను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, ఈగల్ బృందాలు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. ఇలా ఒడిశా నుంచి పుణెకు గంజాయిని సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్న ఈ నలుగుర్ని అరెస్టు చేసి రూ.22 లక్షల విలువైన 91 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాకు చెందిన ప్రకాష్ చంద్ర ప్రదాన్, బసంత్, ఘన్‌శ్యామ్, చిత్రసేన జనీలు గంజాయి స్మగ్లర్ ప్రశాంత్ వద్ద కొరియర్లుగా పనిచేస్తున్నారు. వీరు ఒక్కొక్కరికి పది నుంచి పదిహేను కిలోల గంజాయిని ప్రశాంత్ అందజేసేవాడు. దాన్ని మంచి ట్రాలీబ్యాగుల్లో, హ్యాండ్ బ్యాగ్‌లలో దాచుకుని వీరంతా ఏసీ కంపార్ట్‌మెంట్ టికెట్లు కొని రైళ్లు ఎక్కేవారు. ప్రతీ డెలివరీకి వీరికి రూ.పది వేలను ప్రశాంత్ ఇచ్చేవాడు.అతడు చెప్పినట్లుగా వీరంతా పుణె చేరుకుని సాయిరాం, మామీ అనే వ్యక్తులకు గంజాయి పార్సిళ్లను అందించాల్సి ఉంటుంది. ఇలా ఈ నలుగురు ఏడాదిలో 20సార్లు రైళ్లలో గంజాయి తరలించారు. తరచు వీరు ఏసీ కంపార్ట్‌మెంట్లలో ప్రయాణిస్తూ ఉండటం, ఎప్పుడూ కొత్త కొత్త ట్రాలీబ్యాగులను ఉపయోగిస్తూ ఉండడంతో వీరిపై నిఘా పెట్టి తాజాగా సరుకుతో పట్టుకున్నామని సందీప్ శాండిల్య తెలిపారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు రైళ్లలో గంజాయి రవాణా చేస్తున్న 147 మందిని అరెస్టు చేసి 2,327 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 116 కేసులు నమోదు చేశామని వివరించారు. తాజా అరెస్టుతో ప్రధాన గంజాయి స్మగ్లర్, రిసీవర్ల సమాచారం అందిందని, వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలో దించామని సందీప్ శాండిల్య తెలిపారు.

# ప్రాణాలు తీసిన మతిమరుపు



చింతపల్లి, ఆగస్టు 24(టుడే విదుర):మతిమరుపు ఓ వృద్ధుడి ప్రాణంతీసింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తిరుమలాపురంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాంమూర్తి, తిరుమలాపురం స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలాపురం గ్రామానికి చెందిన గార్లపాటి రాములు(80) కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయన భార్య పదేళ్ల కిందట మృతి చెందగా కుమార్తె ఉన్నారు. కుమార్తె భారతమ్మకు వివాహంకాగా మండలంలోని కుర్మేడు గ్రామంలో ఉంటున్నారు. కొంతకాలంగా రాములు కుర్మేడులోని కుమార్తె ఇంట్లోనే ఉంటున్నాడు. కొంతకాలంగా రాములు మతిమరుపు సమస్యతో బాధపడుతున్నాడు. స్వగ్రామం తిరుమలాపురంలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్న విషయం తెలుసుకుని బుధవారం గ్రామానికి వచ్చారు. రాత్రి గ్యాస్ స్టవ్‌పై వంట చేసుకుని భోజనం చేసి నిద్రించాడు. గ్యాస్ ఆఫ్ చేయకుండా నిద్రకు ఉపక్రమించాడు. కొంత సమయం తర్వాత రాములు లేచి చుట్ట తాగుతుండగా గ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు ధ్వంసమై స్లాబ్ కింద ఉన్న రాములుపై పడింది. భారీ శబ్ధం రావడంతో మనుమడి స్నేహితుడు కుర్మేటి నవీన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో స్లాబ్ కప్పును తొలగించగా రాములు శరీరం పూర్తిగా కాలిపోయి మృతి చెంది కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాములు మనుమడు గార్లపాటి ప్రవీణ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రోటాన్ పంప్ ప్రక్రియలో పొట్టలో బ్లేడ్ల తొలగింపు

## గాంధీ ఆస్పత్రి వైద్యుల ప్రతిభ
## 3 రోజుల పర్యవేక్షణలో మల విసర్జనలో బ్లేడ్ల బహిర్గతం




హైదరాబాద్ సిటీ/అడ్డగుటఆగస్టు 24(టుడే విదుర):కుటుంబంలో తగాదాతో క్షణికావేశానికి గురైన ఓ ఆటో డ్రైవర్ మింగిన షేవింగ్ బ్లేడ్లను ప్రత్యేక చికిత్స (శస్త్ర చికిత్స లేకుండా)తో మల విసర్జనలో బయటకు వచ్చేలా చేశారు గాంధీ ఆస్పత్రి వైద్యులు. మౌలాలీ హౌసింగ్ బోర్డు కాలనీ వాసి మహమ్మద్ ఖాజా(37)కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబంలో గొడవతో క్షణికావేశంలో ఖాజా.. 8 షేవింగ్ బ్లేడ్లు రెండేసి ముక్కలు చేసి మింగాడు. కొద్ది సేపటికి నొప్పి రావడంతో తాను బతకనని ఏడుస్తుండటంతో భయపడ్డ కుటుంబ సభ్యులు ఈ నెల 16న గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ సునీల్ కుమార్ నేతృత్వంలో వైద్య బృందం ఎక్స్‌రే.. తర్వాత సిటీ స్కాన్ తీసి పొట్టలో బ్లేడ్లు ఉన్నట్లు గుర్తించారు.తొలుత ఎండోస్కోపీతో వాటిని బయటకు తీయాలని భావించినా.. ఆ ప్రక్రియలో ఇతర అవయవాలకు అపాయం జరిగి రక్తస్రావమైతే ఇబ్బందిగా మారుతుందని నిర్ణయానికొచ్చారు. ఆహారం, నీరు (నిల్ ఫర్ ఓరల్) ఇవ్వకుండా.. ప్రోటాన్ పంప్ వైద్య ప్రక్రియలో ఇంట్రావీనస్ ద్వారా ద్రావణాలు పంపి.. మల విసర్జనలో బ్లేడ్లు బయటకొచ్చేలా చేశారు. తొలి రోజు కొంత భాగం, రెండో రోజు 90న్ల కిందకు జారిన బ్లేడ్లు.. మూడో రోజు రోగి మల విసర్జనలో పడిపోయాయి. మరోమారు రోగికి ఎక్స్‌రే తీసి బ్లేడ్లు లేవని నిర్ధారించుకున్నాక వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. శస్త్ర చికిత్స చేయకుండానే బ్లేడ్లు తొలగించిన వైద్యుల కృషిని అందరూ ప్రశంసించారు. రోగి పూర్తిగా కోలుకోవడంతో ఈ నెల 21(గురువారం) ఆస్పత్రి నుంచి ఆయన్ను డిశ్చార్జీ చేసినట్లు ఆస్పత్రి అడిషనల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ మీడియాకు చెప్పారు.

# 424 కిలోల గంజాయి పట్టివేత

## లారీలో ఒడిశా నుంచి రాజస్థాన్‌కు తరలింపు..
## గంజాయి విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని అంచనా
## టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించిన ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను



టేకులపల్లి,ఆగస్టు 24(టుడే విదుర): లారీలో ఒడిశా నుంచి రాజస్థాన్‌కు అక్రమంగా తరలిస్తున్న 424 కిలోల గంజాయిని సీసీఎస్, టేకులపల్లి పోలీసులు గురువారం సాయంత్రం సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపారు. టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ పరిధి వెంకట్యాంతండా సమీపంలో సీసీఎస్, టేకులపల్లి పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటుగా అనుమానాస్పదంగా వచ్చిన లారీని ఆపి తనిఖీ చేయగా.. అందులో 424.950 కేజీల గంజాయి బయటపడింది. దీని విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని, గంజాయి కొనుగోలు చేసిన నిందితులు ఒడిశా నుంచి భద్రాచలం, పాల్వంచ మీదుగా రాజస్థాన్ తరలిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.%మొత్తం నలుగురు నిందితుల్లో ప్రభులాల్ గుర్జర్, శివరాజ్ గుర్జర్ పట్టుబడగా.. రాంబాబు, నారాయణ గుర్జర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా.. గంజాయి తరలిస్తున్న లారీని చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్, టేకులపల్లి పోలీసులను డీఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు ఆలకుంట రాజేందర్, శ్రీకాంత్, సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్సై ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



బీబీనగర్,ఆగస్టు 24(టుడే విదుర):దవాఖానాలో గత నెలలో జరిగిన ప్రసవాలు ఎన్ని?, అందులో సాధారణ ప్రసవాలు ఎన్ని? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహేశ్వరి అనే బాలింతతో కలెక్టర్ మాట్లాడి తల్లీ, బిడ్డల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పనితీరును పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా అవగాహన కల్పించాలన్నారు.జిల్లా వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 56 పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రటకనలో తెలిపారు. ఎంప్లాయిమెంట్ అసిస్టెంట్ మిషన్ (టీమ్) కార్యదర్శి శాంతిశ్రీ ఖాళీ పోస్టుల వివరాలు, అర్హతలను వెల్లడించారని వివరించారు. నిర్దేశించిన పోస్టులను మెరిట్, రోస్టర్ అర్హతలనుబట్టి భర్తీ చేయనున్నట్లు వివరించారు.

# కుటుంబంలో చిచ్చు పెట్టిన టీవీ సీరియల్..

## భార్య ఆత్మహత్యాయత్నం..!




మహబూబాబాద్ ఆగస్టు 24(టుడే విదుర): ఓ టీవీ సీరియల్ ఓ కుటుంబంలో చిచ్చుపెట్టింది. అది ఎంతలా అంటే చివరకు భార్యనే ఆత్మహత్యాయత్నం చేసుకునే వరకు దారి తీసింది. ఈ దారుణ ఘటన మహబూబాబాద్ జిల్లాలో వెలుగు చూసింది.%మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోడిపుంజుల తండాకు చెందిన ఓ వ్యక్తి ఉదయమే పొలం పనులకు వెళ్లాడు. ఇక పొలం నుంచి ఇంటికి వచ్చిన భర్తకు అన్నం పెట్టకుండా.. భార్య టీవీలో వస్తున్న ఓ సీరియల్‌లో లీనమైపోయింది. సీరియల్ అయిపోయాక అన్నం పెడుతానని భర్తకు అడ్డగోలుగా సమాధానం ఇచ్చింది.దీంతో కోప్రోదిక్తుడైన భర్త.. సీరియల్ ముఖ్యమా, నేను ముఖ్యమా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్యాయత్నం చేసింది. మొదట కుమారుడికి పురుగుల మందు తాగించి తర్వాత తాను తాగింది. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# మట్టి గణపతులపై మనసేది..



హైదరాబాద్:ఆగస్టు 24(టుడే విదుర):పర్యావరణంతో పాటు భూగర్భ జలాశయాలను కలుషితం చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) గణేశ్ విగ్రహాలను వాడొద్దని, వినాయక చవితి సందర్భంగా వాడవాడలా పర్యావరణ హిత మట్టి గణపతినే వాడాలని ఉన్నత న్యాయ స్థానాలు, పలు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా భారీ ఎత్తున గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు.వాటిలో ఎక్కువగా పీవోపీ విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించడానికి అల్వాల్ సర్కిల్ పరిధిలోని యువజన సంఘాలు, అపార్ట్‌మెంట్, కాలనీ సంఘాలు సమాయత్తమవుతున్నాయి. గతంలో పండగకు 10 రోజుల మందే జీహెచ్‌ఎంసీ అధికారుల ఆ?ధ్వర్యంలో మట్టి గణేశ్‌ల వాడకంపై ప్రచార కార్యక్రమాలను చేపట్టేవారు. ఇప్పుడు ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏ సర్కిల్ పరిధిలో కూడా పెద్దగా కనిపించకపోవడం గమనార్హం.

# టుడే వినోదం



## శంకర వరప్రసాద్.. పండగకి వస్తున్నారు! వీరయ్యతో మరోసారి



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో 'మెగా157' అనే వర్కింగ్ టైటిల్‌తో సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుది దశలో ఉంది. వచ్చే సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. శుక్రవారం చిరంజీవి పుట్టిన రోజు. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించారు. 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖాయం చే శారు. 'పండగకి వస్తున్నారు' అనేది దీని ట్యాగ్‌లైన్. టైటిల్ గ్లింప్స్‌లో... బాస్ అంటూ వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో చిరంజీవి కొత్త మేకోవర్‌లో కనిపించారు. సూట్‌లో స్టయిల్‌గా సిగరేట్ తాగుతూ.. చేతిలో తుపాకీతో ఓ సీన్‌లో కనిపించారు. మరో సీన్‌లో గుర్రాన్ని నడిపిస్తూ సిగరేట్ కాలుస్తూ వింటేజ్ లుక్‌లో మైమరపించారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లో 'రౌడీ అల్లుడు' ట్యూన్‌తో చిరంజీవి ఎంట్రీ అదిరిపోయింది. చివర్లో మన శంకరప్రసాద్ గారు..పండగకి వస్తున్నారు అంటూ హీరో వెంకటేశ్ వాయిస్ ఓవర్‌తో టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'చిరంజీవిని మీరు ఎలా చూడాలనుకుంటున్నారో సంక్రాంతికి రెండింతలు చూస్తారు. పాటలు, వినోదం అన్నీ అద్భుతంగా కుదిరాయి' అని అన్నారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ 'చిరంజీవి సినిమాలను నేను, అనిల్ ఎలా చూస్తామో, ఎలా చూడాలనుకుంటున్నామో అలానే ఇందులో ఆయనను చూపించబోతున్నాం' అని అన్నారు. మరో నిర్మాత సుస్మిత కొణిదెల మాట్లాడుతూ 'నాన్నగారి పుట్టిన రోజున ఆయనతో లేకుండా మీ అందరి ముందు ఇలా ఉండటం బహుశా ఇదే మొదటిసారి. ఇవి నాకు మధుర క్షణాలు. మీ అందరి సపోర్టు కావాలి' అని అన్నారు.

## సంబంధంలేని విషయాల్లో చిరంజీవి వేలు పెట్టరు...




మెగాస్టార్ చిరంజీవి , ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌మధ్య చక్కని అనుబంధం ఉంది. యండమూరి రాసిన 'అభిలాష , రాక్షసుడు డబ్బు టు ద పవర్ ఆఫ్ డబ్బు, నల్లంచు తెల్లచీర' వంటివి నవలలు చిరంజీవి హీరోగా సినిమాలుగా వచ్చాయి. చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం కళారవిందం సంస్థ యండమూరి వీరేంద్రనాథ్ ను జీవన సాఫల్య పురస్కారంతో హైదరాబాద్ లో సత్కరించింది. ఈ సందర్భంగా చిరంజీవితో తనకున్న సాన్నిహిత్యాన్ని యండమూరి వివరించారు.సినిమా నిర్మాణంలో చిరంజీవి కల్పించుకుని సూచనలు చేస్తారని చాలామంది అనుకుంటారని, అది వాస్తవం కాదని యండమూరి స్పష్టం చేశారు. చిరంజీవితో తాను పదిహేను సినిమాలు చేశానని, ఆయన ఏనాడు తనకు సంబంధం లేని విషయాలలో వేలు పెట్టలేదని యండమూరి చెప్పారు. సినిమా నిర్మాణంలో నటులు కల్పించుకుంటారనే అసత్యాలను ప్రచారం చేయవద్దని యండమూరి కోరారు. చిరంజీవి చిత్రాలకు రచన చేయడమే కాకుండా యండమూరి.. చిరంజీవి హీరోగా 'స్టూవర్ట్ పురం పోలీస్ స్టేషన్' మూవీని డైరెక్ట్ చేశారు. అయితే ఈ సినిమా కమర్షియల్ గా సక్సెస్ సాధించలేదు. అయినా చిరంజీవి, యండమూరి మధ్య అనుబంధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. యండమూరి రాసిన పుస్తకాల ఆవిష్కరణ సభలకు చిరంజీవి గతంలో హాజరయయారు. తాజాగా చిరంజీవి జీవిత చరిత్రను తాను పుస్తకంగా రాస్తున్నానని యండమూరి ప్రకటించారు.

## 'కొత్త లోక'గా రాబోతున్న మలయాళ చిత్రం 'లోకా'




కేరళలో ఓనమ్ సందడి నెలకొంది. ప్రతి యేడాదిలానే ఈ సారి కూడా ఓనమ్ సందర్భంగా పలు చిత్రాలు బాక్సాఫీస్ బరిలో పోటీపడుతున్నాయి. విశేషం ఏమంటే ఈ యేడాది నటి లిజి, దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తె కళ్యాణి ప్రియదర్శన్ నటించిన రెండు సినిమాలు బ్యాక్ టు బ్యాక్ జనం ముందుకు వస్తున్నాయి. అందులో ఒకటి 'లోకా చాప్టర్ 1: చంద్ర' . 'ప్రేమలు' ఫేమ్ నస్లేన్ కీ రోల్ ప్లే చేసిన ఈ సినిమాను దుల్కర్ సల్మాన్ తన వేఫరార్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. డామ్నిక్ అరుణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓనమ్ కానుకగా సెప్టెంబర్ మొదటివారంలో విడుదల చేస్తామని మేకర్స్ గతంలో తెలిపారు. అయితే తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ను లాక్ చేశారు. ఆగస్ట్ 28న ఈ సినిమా విడుదల కాబోతోంది. విశేషం ఏమంటే... ఈ సినిమాను తెలుగులో సితార ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ లో సూర్యదేవర నాగవంశీ 'కొత్త లోక' పేరుతో విడుదల చేస్తున్నారు. ఈ పాన్ ఇండియా సినిమా మొత్తం ఐదు భాషల్లో జనం ముందుకు రాబోతోంది. ఇక కళ్యాణీ ప్రియదర్శన్ నటించిన మరో సినిమా 'ఒడుమ్ కుతిర చాడుమ్ కుతిర' కూడా ఓనమ్ కే వస్తోంది. అయితే ఈ సినిమా ఆగస్ట్ 29న రిలీజ్ అవుతోంది. ఇందులో ఫహద్ ఫాజిల్ హీరోగా నటించాడు. అదే రోజున 'మైనే ప్యార్ కియా' మూవీ కూడా విడుదల కాబోతోంది.

## బాబీ బలే ముందుకొచ్చేశాడే...




మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్ట్ 22న సోషల్ మీడియాలో ఆయన అభిమానులు చెలరేగిపోయారు. మెగాభిమానులే కాకుండా సినిమా రంగానికి చెందిన తోటి హీరోలు, నిర్మాతలు, దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులు సైతం చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. అలానే చిరంజీవి తాజా చిత్రాలు 'విశ్వంభర' 'మన శంకర వర ప్రసాద్ గారు సినిమాలకు సంబంధించిన గ్లింప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయిపోయాయి. దీనితో పాటు చిరంజీవితో బాబీ మరోసారి సినిమా చేయబోతు న్నాడనే వార్త కూడా అధికారికంగా వెలువడింది. అలానే చిరు – శ్రీకాంత్ ఓదెల కాంబోలో నాని నిర్మించే సినిమా ఉండనే ఉంది. అయితే ఇక్కడే చిరు బర్త్ డే రోజు చిన్నపాటి ట్విస్ట్ జరిగింది.చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యింది. అయితే దానికి సంబంధించిన విఎఫ్ఎక్స్ కు ఏకంగా ఏడెనిమిది నెలల సమయం పడుతుందని తెలుస్తోంది. అందుకే చిరంజీవి స్వయంగా ఈ సినిమా వచ్చే యేడాది సమ్మర్ స్పెషల్ గా వస్తుందని చెప్పేశారు. ఇక చిరుతో అనిల్ రావిపూడి తీస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' ఖచ్చితంగా సంక్రాంతికి వస్తుంది. ఆ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. మరో ఒకటి రెండు షెడ్యూల్స్ తో అది కూడా పూర్తవుతుంది.

## రాగిణిగా తమన్నా





ఇటు సినిమాలు, ఒక పక్క ఐటమ్ సాంగ్స్, మరో వైపు వెబ్ సిరీస్.. ఖాళీగా కూర్చోకుండా ఏది దొరికితే అది చేసేస్తున్న హీరోయిన్ తమన్నా ఒక్కరేనేమో! ఆమెతో పాటు ఇండస్ట్రీలోకి వచ్చిన హీరోయిన్లలో కొందరు ఇప్పటికే ఇంటికి వెళ్లిపోయినా తన గ్లామర్‌ను కాపాడుకుంటూ ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు తమన్నా. 'స్త్రీ 2' సినిమాలో ఆమె చేసిన 'ఆజ్ కీ రాత్' పాట జనాన్ని ఊపేసింది. దీని వల్ల 'వాన్' సినిమాలో ఛాన్స్ వచ్చింది. అలాగే 'రాగిణి ఎంఎంఎస్' మూడో ఫ్రాంఛైజీలో తమన్నా నటించనున్నారన్నది తాజా సమాచారం. హారర్ కథాంశంతో 'రాగిణి ఎంఎంఎస' చిత్రం తొలిసారిగా 2011లో వచ్చింది. 2014లో సెకండ్ పార్ట్ ప్రేక్షకులను పలకరించింది. అందులో సన్నీ లియోన్ నటించింది. ఆ సినిమాకు మూడో భాగం తీయాలనే ఆలోచన ఇప్పుడు ఏక్తాకపూర్‌కు రావడంతో తమన్నాను సంప్రదించారు. ఈ రొమాంటిక్ హారర్ థ్రిల్లర్‌లో నటించడానికి తమన్నా కూడా ఆసక్తి చూపించడంతో ఏక్తా ముందడుగు వేశారు. ఈ ఏడాది చివర్లో 'రాగిణి ఎంఎంఎస్ 3' చిత్రం సెట్స్‌పైకి రానుంది. దర్శకుడు, తారాగణం వివరాలు త్వరలో వెల్లడిస్తారు


## గోవిందా దంపతుల విడాకులు... వివరణ



బాలీవుడ్ హీరో గోవిందా, సునీతా అహూజా విడాకులు తీసుకోబోతున్నారంటూ కొన్నాళు ్లగా మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే పలు సందర్భాల్లో వారిద్దరూ మీడియా కథనాలను ఖండించారు. మరోమారు వారి విడాకుల వార్త బాలీవుడ్ మీడియాలో పతాక శీర్షికలకెక్కింది. కొన్నాళ్లుగా గోవిందా, సునీత విడివిడిగా జీవిస్తున్నారనీ, వారిమధ్య తలెత్తిన మనఃస్పర్థల కారాణంగా ఇప్పుడు విడాకుల కోసం సునీత బాంద్రా కోర్టును ఆశ్రయించారంటూ బాలీవుడ్ మీడియాలో మరోసారి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తమ విడాకుల వార్తలను సునీతా అహుజా ఖండించారు.



# క్రీడావార్తలు



## బెంగళూరు అవుట్

న్యూఢిల్లీ: ఊహించినట్టుగానే మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భాగంగా బెంగళూరులో జరగాల్సిన ఐదు మ్యాచ్‌లను తరలించారు. చిన్నస్వామి స్టేడియంలో వీటి నిర్వహణకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడంలో అక్కడి క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) విఫలమైంది. దీంతో ఈ మ్యాచ్‌లన్నింటినీ నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియానికి తరలిస్తున్నట్టుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో చాంపియన్‌గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ ర్యాలీ కారణంగా స్టేడియం బయట తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మృతి చెందడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించి చిన్నస్వామిలో ప్రస్తుతానికి మ్యాచ్‌లను నిషేధించింది. ఇక డీవై పాటిల్ స్టేడియంలో మూడు లీగ్ మ్యాచ్‌లు ఓ సెమీస్, ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ టైటిల్ పోరు మాత్రం పాక్ జట్టు విజయాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ దాయాది జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్ కొలంబోలో నిర్వహిస్తారు. ఓవరాల్‌గా నవీ ముంబై, విశాఖపట్నం, గువాహటి, ఇండోర్, కొలంబోలో మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగుతుంది. మరోవైపు చిన్నస్వామి స్టేడియం వ్యవహారాన్ని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఓ కొలిక్కి తేలేకపోతే వచ్చే ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లకు కూడా దూరం కావాల్సి ఉంటుంది.మరికొన్ని మార్పులు..: ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌లో ఐసీసీ కొన్ని వేదికలను మార్చింది. దీనిలో భాగంగా సెప్టెంబరు 30న ఆతిథ్య జట్టు భారత్-శ్రీలంక మధ్య జరగాల్సిన ఆరంభ మ్యాచ్‌ను బెంగళూరు నుంచి గువాహటికి తరలించారు. అక్టోబరు 3న ఇంగ్లండ్-దక్షిణాఫ్రికా



మ్యాచ్ కూడా గువాహటిలోనే జరుగుతుంది. అంతేకాకుండా 10న కివీస్-బంగ్లాదేశ్ మ్యాచ్‌ను వైజాగ్ నుంచి గువాహటికి మార్చారు. ఇక అదే నెల 20న జరిగే శ్రీలంక-బంగ్లాదేశ్ మ్యాచ్, 23న జరిగే భారత్-కివీస్ మ్యాచ్‌లను నవీ ముంబైకి మార్చారు. మొత్తంగా విశాఖలో ఐదు మ్యాచ్‌లు జరుగనుండగా.. భారత జట్టు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలతో ఇక్కడే ఆడనుందిభారత క్రికెట్ జట్ల సెలెక్టర్ల కోసం వచ్చే నెల 10 లోగా బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందులో పురుషుల క్రికెట్ కోసం రెండు, మహిళల క్రికెట్ కోసం నలుగురు సెలెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. చీఫ్ సెలెక్టర్ అగార్కర్ (వెస్ట్ జోన్), అజయ్ రాత్రా (నార్త్)ల పదవీ కాలాన్ని బోర్డు మరో ఏడాది పొడిగించింది. దీంతో సౌత్, సెంట్రల్ జోన్ల సెలెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. అయితే సౌత్ నుంచి మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజాకు దాదాపు చోటు ఖాయమైనట్టు సమాచా రం. మహిళల సెలెక్షన్ కమిటీలో శ్యామా దే షా మాత్రం కొనసాగనుండగా మిగతా నలుగురిని నియమించాల్సి ఉంది. మరోవైపు పురుషుల క్రికెట్ సెలెక్టర్‌గా పదవీకాలం ముగిసిన ఎస్.శరత్.. రెండోసారి జూనియర్ క్రికెట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించడం దాదాపు ఖాయమైంది.

## భారత్ ఎ 299 ఆలౌట్



బ్రిస్బేన్: రాఘవీ బిస్త్ (93), జోషిత (51) అర్ధ శతకాలతో పోరాడడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఓవర్‌నైట్ 93/5 స్కోరుతో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 299 పరుగులకు ఆలౌటైంది. జార్జియా, బ్రౌన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా 'ఎ' రెండో రోజు ఆఖరికి 158/5 స్కోరుతో ఇక్కట్లలో పడింది. తహిలా విల్సన్ (49) రాణించింది. మీడియం పేసర్ సలీమా, స్పిన్నర్ రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.

## వలరివన్ స్వర్ణ కాంతులు




షిమ్‌కెంట్ (కజకిస్థాన్): భారత ఏస్ షూటర్ ఎలవెనిల్ వలరివన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం కొల్లగొట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో 253.6 పాయింట్లతో వలరివన్ టైటిల్ దక్కించుకుంది. చైనా, కొరియా రజత కాంస్యాలు అందుకున్నాయి. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభయ్ సింగ్ సెఖాన్/గనేమత్ సెఖాన్ ద్వయం కాంస్యం గెలుపొందింది. ఇక..మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో వలరివన్, మెహూలీ, అనన్యా నాయుడు త్రయం కాంస్యం సాధించింది. జూనియర్ విభాగంలో భారత షూటర్ల ఆధిపత్యం కొనసాగింది. జూనియర్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో హర్‌మెహర్/యశస్వీ రాథోడ్ జోడీ పసిడి చేజిక్కించుకుంది. మహిళల జూనియర్ 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో శాంభవీ శ్రవణ్, హృద్యశ్రీ, ఇషా అనిల్ త్రయం స్వర్ణం కైవసం చేసుకుంది.

## క్రికెట్‌కు గౌహర్ వీడ్కోలు




క్రికెట్‌కు హైదరాబాదీ లెఫ్టామ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా వీడ్కోలు పలికింది. క్రికెటర్‌గా అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. 37 ఏళ్ల సుల్తానా 2008లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసింది. 2009, 2013 వన్డే వరల్డ్‌కప్‌ల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆమె, కెరీర్‌లో 50 వన్డేలు, 37 టీ20లు ఆడి మొత్తం 95 వికెట్లు సాధించింది. 2014 తర్వాత జాతీయ జట్టులో చోటు కోల్పోయిన సుల్తానా తిరిగి 2024 మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ తరఫున మెరిసింది. ఈ ఏడాది కూడా వారియర్స్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆమె అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు దేశవాళీ పోటీలకు కూడా వీడ్కోలు పలికింది. కెరీర్ ఆసాంతం తనకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యులు, సహచర క్రికెటర్లు, కోచింగ్ సిబ్బంది, బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపింది. బీసీసీఐ లెవల్-2 శిక్షణ పూర్తి చేసిన సుల్తానా భవిష్యత్‌లో కోచ్‌గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది.

## ప్రో.కబడ్డీ.. మరింత రంజుగా



ముంబై: మరో వారం రోజుల్లో ప్రో.కబడ్డీ లీగ్ (పీకేఎల్) అభిమానులను అలరించనుంది. అయితే సీజన్-12లో అనేక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పోటీలను ఇంకా రసవత్తరంగా మార్చి ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించేందుకు లీగ్ దశను మరింత విస్తరించారు. ప్లేఆఫ్స్‌లోనూ మార్పులు చేశారు. ఈ సీజన్‌ను విశాఖపట్నం, జైపూర్, చెన్నై, ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఈనెల 29న ప్రారంభమయ్యే పీకేఎల్ లీగ్ దశలో మొత్తం 108 మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో జట్టు 18 మ్యాచ్‌లు ఆడుతుంది. టైబ్రేకర్ విధానాన్ని మరింత విస్తృతం చేయడంతోపాటు లీగ్ దశలో 'గోల్డెన్ రైడ్' అమలు చేయనున్నారు. గతంలో గోల్డెన్ రైడ్ ప్లేఆఫ్లో మాత్రమే ఉండేది. ఇకపై లీగ్ దశలో మ్యాచ్ 'టై' అయితే ఐదు రైడ్లతో కూడిన షూటౌట్ నిర్వహిస్తారు. ఇందులో ఫలితం తేలకపోతే గోల్డెన్ రైడ్ ఉంటుంది. అప్పటికీ ఫలితం రాకపోతే 'టాస్' ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అలాగే పాయింట్ల విధానాన్ని మరింత సరళతరం చేశారు. ఇకపై విజయానికి రెండు పాయింట్లు కేటాయిస్తారు. ఓటమికి పాయింట్లేమీ ఉండవు. ఇంకా..ప్లేఆఫ్స్‌ను ప్రక్షాళన చేయడంతోపాటు 'ప్లేఇన్' విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఫలితంగా..లీగ్ దశలో తొలి ఎనిమిది స్థానాలలో నిలిచిన జట్లకు ప్లేఆఫ్సకు క్వాలిఫై అయ్యే అవకాశముంటుంది. కొత్త విధానంలో..లీగ్ దశలో ఐదు నుంచి ఎనిమిది స్థానాలలో నిలిచిన జట్లు 'ప్లేఇన్' మ్యాచ్‌ల్లో తలపడతాయి. ప్లే ఇన్ మ్యాచ్‌ల విజేతలు ఎలిమినేటర్స్‌లో అడుగు పెడతాయి. మూడు, నాలుగు స్థానాలు సాధించిన జట్లు 'మినీ క్వాలిఫయర్'లో ఢీకొంటాయి. మినీ క్వాలిఫయర్‌లో గెలుపొందిన జట్టు ముందడుగు వేస్తుంది. ఇక ఓడిన జట్టుకు ప్లేఆఫ్ ద్వారా మరో అవకాశం లభిస్తుంది. లీగ్ దశలో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు క్వాలిఫయర్-1లో తలపడతాయి. క్వాలిఫయర్-1 విజేత నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 ద్వారా మరో చాన్సు లభిస్తుంది. ప్లేఆఫ్లో మూడు ఎలిమినేటర్లు, రెండు క్వాలిఫయర్స్ ఉంటాయి.ఈనెల 29న విశాఖపట్నం అంచెతో లీగ్ మొదలవుతుంది.

## తుదిపోరుకు తుంగభద్ర



రోహిత్ (87), డీబీ ప్రశాంత్ (64 నాటౌట్) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో తుంగభద్ర వారియర్స్ జట్టు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఫైనల్‌కు దూసుకువెళ్లింది. శుక్రవారం ఇక్కడ జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో తుంగభద్ర ఐదు వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై గెలుపొందింది. తొలుత భీమవరం నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 183 పరుగులు చేసింది. సాయి శ్రవణ్ (71 నాటౌట్)తో రాణించాడు. వారియర్స్ బౌలర్ దీపక్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం వారియర్స్ 19 ఓవర్లలో ఐదు వికెట్లకు 188 పరుగులు చేసి ఫైనల్లోకి ప్రవేశించింది. బుల్స్ బౌలర్లలో హరిశంకరరెడ్డి, సత్యనారాయణరాజు చెరో రెండు వికెట్లు తీశారు. శనివారం జరిగే ఫైనల్లో అమరావతి రాయల్స్‌తో తుంగభద్ర వారియర్స్ తలపడనుంది.

## దక్షిణాఫ్రికాదే సిరీస్

మెకే (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో పేసర్ ఎన్‌గిడి ఐదు వికెట్లతో చెలరేగడంతో సఫారీలు 84 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తుగా ఓడించారు. ముందుగా దక్షిణాఫ్రికా 49.1 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. మ్యాథ్యూ బ్రీట్జ్‌కే (88), స్టబ్స్ (74) అర్ధసెంచరీలతో రాణించారు. ఛేదనలో ఆసీస్ 37.4 ఓవర్లలో 193 రన్స్ కుప్పకూలింది. ఇన్‌గ్లిస (87) రాణించాడు.




## ఎరాని జోడీ వన్స్‌మోర్



న్యూయార్క్: డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జోడీ పునర్ వ్యవస్థీకరించిన యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకొంది. గురువా రం జరిగిన ఫైనల్లో ఇటలీ జంట ఎరాని-ఆండ్రియా వవస్సోరి జోడీ 6-3, 5-7, 10-6తో మూడో సీడ్ ఇగా స్వియాటెక్-కాస్పర్ రూడ్ జంటపై గెలిచింది. తుది పోరును మాత్రం రెగ్యులర్ ఫార్మాట్‌లో నిర్వహించారు. సింగిల్స్ స్టార్లతో డ్రాను నింపేసినా అంతిమంగా డబుల్స్ స్పెషలిస్టులకే టైటిల్ దక్కింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో ఎరాని-వవస్సోరి జంట 4-2, 4-2తో డేనియల్ కొలిన్స్-క్రిస్టియన్ హ్యారిసన్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో స్వియాటెక్-రూడ్ ద్వయం 3-5, 5-3, 10-8తో టాప్ సీడ్ జెస్సికా పెగుల-జేక్ డ్రేపర్‌పై పోరాడి నెగ్గింది.

టుడే బిజినెస్

# ద్వితీయార్థంలో కొలువుల జాతర



న్యూఢిల్లీ: దేశంలో ఉపాధి మార్కెట్ వర్తమాన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో జోరందుకోనుంది. పలు యాజమాన్యాలు తమ సంస్థల్లో కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలియచేశాయి. దేశంలో ఉద్యోగాల మార్కెట్ ధోరణిపై నౌకరీ నిర్వహించిన ద్వైవార్షిక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 72% మంది యాజమాన్య ప్రతినిధులు కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ద్వితీయార్థంలో కొత్తగా కొంత మందిని ఉద్యోగాల్లో చేర్చుకునే యోచన ఉన్నట్టు 94% మంది తెలియచేశారు. దేశవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన 1,300 మంది యాజమాన్య ప్రతినిధులు అందించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా పలువురు ఉద్యోగాలు కోల్పోతారన్న భయాలు విస్తృతంగా వ్యాపించిన వాతావరణంలో కూడా ఉద్యోగ మార్కెట్‌పై ఏఐ ప్రభావం అంతగా ఉంటుందని తాము భావించడంలేదని 87% మంది అన్నారు. పైగా ఉపాధి మార్కెట్‌కు ఏఐ చోదకశక్తిగా ఉంటుందని 13% మంది అభిప్రాయపడ్డారు. ఏఐ వల్ల ప్రయోజనం పొందే రంగాల్లో ఐటీ (42%), అనలిటిక్స్ (17%), బిజినెస్ డెవలప్‌మెంట్ (11%) ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తం అయింది. ప్రధానంగా ఏఐ ఆధారిత అవకాశాలు పెరుగుతాయన్నారు. నికరంగా అదనపు సిబ్బందిని నియమించుకోవడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు 72% మంది చెప్పడం ప్రోత్సాహకరమైన అంశమని నౌకరీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయెల్ అన్నారు. స్పెషలైజ్డ్ టెక్నాలజీ విభాగాల్లో కొత్త ఉద్యోగాలకు డిమాండ్ ఉంటుందన్న సంకేతాలతో దేశంలో ఉపాధి సెంటిమెంట్ బల పడిందని నౌకరీ ఆ నివేదికలో తెలిపింది. 37% యాజమాన్యాలు ఐటీ విభాగంలో కొత్త ఉద్యోగులను నియమించుకోనున్నట్టు తెలపడం విశేషం. అయితే సాంప్రదాయిక టెక్నాలజీల కన్నా నూతన టెక్నాలజీ విభాగాల్లోనే కొత్త ఉద్యోగాల కల్పన జరుగనుంది. మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఏఐ ఆధారిత టెక్నాలజీ విభాగాల్లో సామర్థ్యాలను పెంచుకోవడం విభిన్న రంగాల పరిశ్రమలకు తప్పనిసరి అయిందని ఆ నివేదికలో పేర్కొన్నారు. అనుభవం విషయానికి వస్తే 4-7 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి డిమాండు అధికంగా ఉన్నట్టు తేలింది. అనుభవం ఉన్న వారిని ఉద్యోగాల్లో చేర్చుకోవాలనుకుంటున్నట్టు 47% మంది తెలిపారు. ఎంట్రీ స్థాయి (మూడేళ్ల లోపు అనుభవం) ఉద్యోగులను నియమించుకుంటామని 29% మంది చెప్పగా 8-12 సంవత్సరాల అనుభవం గల వారిని తీసుకుంటామన్న వారి సంఖ్య 17% ఉంది. 13-16 సంవత్సరాల అనుభవం ఉన్న వారిని తీసుకుంటామన్న వారి సంఖ్య కేవలం 3% ఉంది.

# మళ్లీ తగ్గిన బంగారం ధరలు.. నేటి రేట్స్ ఎలా ఉన్నాయంటే..




ఇంటర్నెట్ డెస్క్: బంగారంపై పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి సువర్ణావకాశం. దేశంలో బంగారం ధరలు మళ్లీ స్వల్పంగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, దేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.1,00,520గా ఉంది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.92,140గా ఉంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్‌ల బంగారం ధర రూ.75390గా ఉంది. కిలో వెండి ధర స్వల్పంగా పెరిగి రూ.1,18,100కు చేరుకుంది. ప్లాటినం ధరల్లో కూడా స్వల్ప పెరుగుదల కనిపించింది. 10 గ్రాముల ప్లాటినం ధర ప్రస్తుతం రూ.37,720గా ఉంది. అమెరికా, చైనా మధ్య ట్రేడ్ వార్ అవకాశాలు తగ్గాయన్న భావనతో బంగారానికి డిమాండ్ తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు, డాలర్ బలపడం కూడా బంగారానికి డిమాండ్ తగ్గిస్తోంది. ఇక భారత్‌లో అనేక మంది ట్రేడర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడం కూడా బంగారం ధరలు దిగొచ్చేలా చేస్తోంది.

# ఈ ఏడాదే భారత్‌లో ఓపెన్ ఏఐ కార్యాలయం



న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరిలో ఢిల్లీలో తమ తొలి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఓపెన్ ఏఐ కంపెనీ తెలిపింది. చాట్ జీపీటీ సహా ఏఐ ఆధారిత ఓపెన్ ఏఐ టూల్స్‌కు అమెరికా తర్వాత భారత్ రెండో అతి పెద్ద మార్కెట్‌గా మారింది. దీంతో భారత్‌లోనూ కార్యాలయం ఏర్పాటు చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ కార్యాలయంలో పని చేసేందుకు అవసరమైన ఉద్యోగుల నియామక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించినట్టు వెల్లడించింది. తమ ఏఐ టూల్స్‌కు భారత్‌లో వేగంగా పెరుగుతున్న గిరాకీని తట్టుకునేందుకు ఈ కార్యాలయం తోడ్పడుతుందని ఓపెన్ ఏఐ భావిస్తోంది.

# స్కైస్విఫ్ట్ 56 డ్రోన్‌కు డీజీసీఏ సర్టిఫికేషన్




స్థానిక మారుత్ డ్రోన్స్ కంపెనీ "స్కైస్విఫ్ట్ 56" పేరుతో మరో సరికొత్త డ్రోన్‌ను అభివృద్ధి చేసింది. దీనికి పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి సర్టిఫికేషన్ కూడా లభించినట్టు కంపెనీ తెలిపింది. తక్కువ బరువు, అత్యాధునిక పరికరాలు ఉండే ఈ డ్రోన్‌ను రెండు నిమిషాల్లోనే ఫిట్ చేసి ఉపయోగించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన నిఘా, కచ్చితమైన మ్యాపింగ్‌తో క్షేత్ర స్థాయి శిక్షణకు ఈ డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. డ్రోన్ల ద్వారా జరిగే వ్యూహాత్మక నిఘా, పర్యవేక్షణలకు ఈ డ్రోన్ చక్కటి పరిష్కారమని మారుత్ డ్రోన్స్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు వీ ప్రేమ్ కుమార్ తెలిపారు.

# వచ్చే నెల 3 4 తేదీల్లో జీఎస్‌టీ మండలి భేటీ





న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్‌టీ మండలి వచ్చే నెల 3-4 తేదీల్లో సమావేశం కానుంది. రేట్ల హేతుబద్దీకరణ, పరిహార సుంకం, బీమాపై ఏర్పాటైన మంత్రుల బృందాల సిఫారసులపై ఈ సమావేశంలో జీఎస్‌టీ మండలి చర్చించనుంది. కేంద్రం ఆర్థిక మంత్రితోపాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు ఈ మండలిలో సభ్యులుగా ఉన్నారు. జీఎస్‌టీ మలి తరం సంస్కరణల్లో భాగంగా దీపావళి నాటికి పన్ను రేట్లను హేతుబద్దీకరించనున్నట్టు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల ఉత్పత్తులపైన మాత్రం 40 శాతం ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే, వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను జీఎస్‌టీ నుంచి పూర్తిగా మినహాయించాలని కూడా మోదీ సర్కారు ప్రతిపాదించింది. ప్రస్తుతం బీమా పాలసీలపై జీఎస్‌టీ రేటు 18 శాతంగా ఉంది.

# ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణం. సెన్సెక్స్ 693.86 పాయింట్లు నష్టపోయి 81,306.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 213.65 పాయింట్లు కోల్పోయి 24,870.10 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.2.62 లక్షల కోట్లు తగ్గి రూ.453.65 లక్షల కోట్లకు పడిపోయింది. %ఆన్‌లైన్ గేమింగ్ రంగంలోని కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. నజారా టెక్నాలజీస్ షేరు మరో 4.13% పతనమైంది. గడిచిన మూడు సెషన్లలో ఈ స్టాక్ 17.52% క్షీణించింది. డెల్టా కార్ప్ షేరు మరో 3.50%, ఆన్‌మొబైల్ గ్లోబల్ 2.73% తగ్గాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసల నష్టంతో రూ.87.52 వద్ద ముగిసింది. ఈనెల 15తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 148.8 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 69,510.6 కోట్ల డాలర్లకు పెరిగాయని ఆర్‌బీఐ వెల్లడించింది.

# వచ్చే నెలలో ఫెడ్ రేట్లు తగ్గే చాన్స్



కాన్సాస్ (అమెరికా): ప్రామాణిక వడ్డీ రేట్లను త్వరలోనే తగ్గించేందు కు అవకాశాలున్నాయని అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. అయితే, మార్కెట్లో పెరిగిన అనిశ్చితులు పరపతి విధానంపై నిర్ణయాలను మరింత సంక్లిష్టతరం చేశాయని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కాన్సాస్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జాక్సన్ హోల్ సదస్సులో పావెల్ పేర్కొన్నారు. కాగా, ప్రామాణిక వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకునేందుకు యూఎస్ ఫెడరల్ రిజర్వ్‌కు చెందిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ వచ్చేనెల 16-17 తేదీల్లో భేటీ కానుంది. సమావేశం చివరి రోజున వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఫెడ్ రేట్ల తగ్గింపుపై పావెల్ తాజా సంకేతాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు భారీ ర్యాలీ సాధించింది. డౌజోన్స్ ఒకదశలో 900 పాయింట్ల (2 శాతం) మేర పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006